కొంటె కథ

# మెనీ మెనీ థాంక్స్ మాలతీ!!

సంధ్య చీకట్లు అల్లుకోకుముందే ఇల్లు చేరేవాడు—ఇప్పుడు అర్ధరాత్రైనా రావడం లేదు. ఎందుకో మరి!

ఎప్పుడైనా ఓ గంట లేటైతే, స్కూటరు మీంచే 'సారీ—సరూ', అనే మనిషి ఇప్పుడు నోరే విప్పటం లేదు. ఏమిటో మరి!!

ఆవేళ రాత్రి— పదకొండు దాటింది.

టక్—టక్ మని వీధి తలుపు చప్పుడైంది. సరోజ రుస రుసలాడుతూ వెళ్లి తలుపు తీసింది. శేఖరం లోపలి వచ్చాడు.

చేతిలో ఉన్న పువ్వుల పొట్లం టేబిల్ మీద పెట్టాడు. ఏదో ఎంగిలిపడ్డట్లు రెండు మెతుకులు తిని మంచం మీద వాలిపోయాడు. అలా పడుకున్న వాడు మళ్లీ తెల్లారేకగాని లేవకపోవడం, తెచ్చిన పూలు తల్లోకిరాక బల్లమీదే ఎండిపోడం, ఈ మధ్య కొన్నాళ్ళ బట్టి జరుగుతూనే ఉంది. కనీసం తనని పలకరించకపోడం సరోజకి చాలా బాధగా ఉంది.

'వ్యవహారం చూస్తుంటే తను అనుకున్నదే నిజం' అనిపించిందామెకి. క్షణాల్లో అనుమానం బలపడింది. ఎక్కడెక్కడ తిరిగొస్తున్నాడో పతి దేవుడు.

ఆడవాళ్ళ నైజమే అంత. మొగుడు ఆలస్యంగా ఇంటికొస్తే ఇహ అదే అర్ధం. పలకరింపు కూడా లేకపోతే ఇక వేరే చెప్పేదేముంది.

ప్రపంచంలో దేన్నైనా సహిస్తారుగాని కట్టుకున్న వాడి క్యారక్టర్ మీద అనుమానం రేగితే ఇక ఆడవాళ్ళని పట్టలేం. నిజమే మరి— 'భర్తతోడిదే లోకం' వాళ్ళకి, నూరేళ్ళ జీవితం అతగాడితోనే ముడివడి ఉన్నప్పుడు, ఆ ముడి విడిపోయేంత లూజుగా ఉంటే ఏ భార్య మాత్రం తట్టుకోగలదు? అయితే—అందరి ఆడవాళ్ళలాగే తనూ అంత బాధపడ్డానికి తనకెంతవరకు అర్హత ఉంది అనే ఆలోచన ఏనాడూ సరోజకిరాలేదు.

మొదట్నించి వన్—న్— విచిత్ర తత్వం ఆమెగారిది. తను పోస్ట్ గ్రాడ్యుయేట్ అనే అహంకారం కావలసినంత! తనకు తోచిన విధంగా తను సుఖపడ్డానికి 'భార్య'కి స్వేచ్ఛ ఉంది అనే సెంటిమెంట్ ఆకాశమంత. కాపురానికి కొచ్చి పదిహేనేళ్లయినా, పన్నెండేళ్ల కొడుకూ, పదేళ్ళ పిల్లా, ఎదుగుతున్నా, ఇంకా ప్రతిరాత్రి 'మొదటిరాత్రి'లా ముచ్చటగా తెల్లారాలి అనేది ఆమె సిద్ధాంతం. ఒంటికి ఒళ్ళు తగలందే కంటికి కునుకురాదు!

మరో వారం రోజులు గడిచాయ్.

శేఖరం పరిస్థితి ఇంకా దిగజారింది. నిద్రలో ఇప్పుడు మూల్గుతున్నాడు కూడా. "ఒళ్ళు తెలియకుండా అడ్డమైన కొంపలకీ తిరిగితే పరిస్థితి ఇలా కాక మరోలా ఎలా ఉంటుంది?"అని సరోజ అంతర్ఘోష

ఆ రాత్రి ఇహ ఆపుకోలేక పైకి అనేసింది. "మీ ప్రవర్తన నాకేం నచ్చలేదండి. డెఫినెట్‌గా మీ క్యారక్టర్ పాడైంది. ఇక నేను నుయ్యో, గొయ్యో చూసుకుంటాను..."

ఆమె వైపు అదోలా చూస్తూ శేఖరం అన్నాడు—"పాడైంది నా క్యారెక్టర్ కాదు సరూ— నా హెల్త్. పాడవడానికి కారణమూ నేను కాదు".

"మరి ఎవరు?... ఎవరు... చెప్పండి"

తూలుతున్న మనిషిని ఛటుక్కున పట్టుకుంది.

"ఎవరో చెప్పండి..."

"అదంతా తర్వాత మాట్లాడుకోవచ్చు. ముందు నన్ను హాస్పిటల్లో చేర్పించు. నీకు పుణ్యముంటుంది..."

హాస్పిటల్లో ఇప్పుడు ఇన్‌పేషెంట్ శేఖరం.

ఎమ్.సితో పాటు ఆఫీసుకి నెల్లాళ్లకి సెలవు కాగితం వెళ్లింది. డాక్టర్ రవీంద్ర, శేఖరానికి క్లాస్‌మేట్, ప్రాణ స్నేహితుడు కూడా. అతనికి అసిస్టెంట్ డాక్టర్ మాలతి.

శేఖరం అడ్మిట్ అయిన రెండో రోజున డాక్టరన్నాడు—

"సరోజా—శేఖరం కండిషన్ బాగాలేదు".

కాళ్ళకింద భూమి కదిలినట్టయిందామెకు.


"ఈ దుస్థితికి కారణం నువ్వు..." రవీంద్ర అన్నాడు.

జలజలా కన్నీళ్లు రాలాయ్ ఆమెకు.

'కండిషన్ బాగాలేదు' అని డాక్టరంటే అందులో ఎంత అర్థముందో! గుండెను కోసేసే మాట అంది!

'కారణం నేనా?... నేనా...డాక్టర్?' చాలా బాధగా అడిగింది.

"ఔను...నువ్వే. 'ఎలాగ' అన్నది డాక్టర్ మాలతి నీకు తెలియజేస్తుంది..." కాస్త విసురుగా అన్నాడు. అక్కడినించి కదలబోతూ మళ్లీ అన్నాడు "నీకో విషయం చెప్పడం నా ధర్మం. శేఖరం నిప్పులాంటి మనిషి. రోజూ అర్ధరాత్రి వరకూ మా బంగళాలో నాతోనే



ఉంటున్నాడు—ఇన్నాళ్ళూ—చప్పున ఇంటికి చేరడం భయంవేసి..."

రోజూ ఇంటికీ హాస్పటల్‌కీ మధ్య తిరుగుతూంది సరోజ. పిల్లలు సరేసరి. తల్లితో బాటు వాళ్ళూ నలిగిపోతున్నారు.

పది రోజులు గడిచాయ్. ఆ వేళ ఓ ఉత్తరం అందింది. సరోజకి మాలతి వ్రాసినదది.

మైడియర్ సరోజా,


మనిషికి అక్షర జ్ఞానంకంటె విషయజ్ఞానం ఎక్కువ అవసరం. అందులో ఆడవాళ్ళకు మరీను. ఇదే నీలో లోపించింది. నీలో 'లస్ట్' ఎక్కువ. హద్దులు మీరిన తృష్ణని చల్లార్చుకోవడం కోసం

ఉగాది కొంటె కథల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ

## "నీ శృతి మించిన శృంగారం నీ భర్త మతిమరుపుకి కారణమైంది.

## కొత్తరోజుల్లోని కొంటె చేష్టలు కొసదాకా సాగాలంటే ఎలా?"

శేఖరం శక్తిని పూర్తిగా ఉపయోగించుకున్నావ్. అది గొప్ప ఎక్స్‌ప్లాయిటేషన్! వాలుజడని చేతిలోకి తీసుకున్నంత వాటంగా అతన్ని నీ దాసుణ్ణి చేసుకున్నావ్. విలవ్ కనబడకుండా విలనిని సృష్టించిన ఘనత నీది. నిర్వీర్యుడయ్యాడు శేఖరం. మెరుపులాంటి చురుకుతనం పోయి



అగ్గిపెట్టెలో అగ్గిపుల్లలా పడి ఉంటున్నాడిప్పుడు ఆఫీసులోనూ, ఇంట్లోనూ కూడా. నాకూ, రవీంద్రకూ మీ సంసార విషయాలు తెలుసు. నీ శృతిమించిన శృంగారం అతని మతిమరుపుకు కూడా కారణం అయింది. కొత్తరోజుల్లోని కొంటె చేష్టలు కొసదాకా సాగాలంటే ఎలా? జీవుడు దేవుడని నిన్ను నమ్మించలేనుగాని, దేహం దేవాలయంలాంటిదని మాత్రం తెలుసుకో. మడత పేచీలు పెట్టి, గారాలు పోయి, అతన్ని నీ జాగీరులా వాడుకున్నావ్. చదివిన చదువు ఎంతదైనా నేచర్‌కి విరుద్ధంగా నడిస్తే సంసారాలు సజావుగా సాగవు. నాలుగు పదులు నిండకుండానే అతనిలో 'లంబగో' క్రానిక్ అయింది. 'సియాటికా' అతన్ని నిలువునా కుదిపేస్తోంది. పొటెన్సీ ఇగిరిపోయింది. అయినా నీ తృప్తి కోసం పువ్వులు తెచ్చి పెడుతున్న అతని అంతఃకరణకి ఎంతని విలువకట్టగలవు? నీరసపడిన గుండె పగబట్టిన పాముకంటె ప్రమాదం, ఇంతదూరం అవసరం కనుక చెప్పాను.

చివరగా మరొక్క మాట.

తలపుల తవిరాకులు రాలినా, హృదిలో వేదన రగిలినా, అది శూన్య శిశిరానికి సంకేతం. ఆ వెనుక వసంతం రావడం సహజం. అయితే ఇందుకు ప్రకృతి నిన్ను కనికరించాలి. మీ వారికి మెడిసనూ, నీకు వెండిటేషనూ ఇప్పట్లో అర్జంట్ అవసరాలు.

—మాలతి

సరోజకి మరోజన్మ ఎత్తినట్టయింది. ఎంత ఘోరం చేసింది తను! తనలాగే ఉంటున్నారా అందరు భార్యలూను?

ఉత్తరం అందింది లగాయతు—పూజలు ప్రారంభించింది. ఉపవాసాలు చేసింది. భగవధ్యానంలో రోజూ గంటలు కొద్దీ గడిపింది.

'కాలానికీ కనికరమే స్త్రీజాతి అంటే' అన్నట్టు ఉరకలు, పరుగులు మీద ఉగాది వచ్చింది. ఆ వేళ తెల్లవారకుండానే ఉలిక్కిపడి లేచింది. ఎద ఎదల్లో ఏదో ఆశ పల్లవించింది. మదిలో ఆనందమేదో నినదించింది. కొమ్మమీది కోయిల గొంతు శేఖరం పిలుపులా తియ్యగా తగిలింది. అదే వసంతోదయం మరి!

పరుగు పరుగున హాస్పిటల్‌కి వెళ్లింది బ్రెడ్డు, కాఫీ తీసుకుని.

గుమ్మంలోనే కనిపించి అన్నాడు డాక్టర్ రవీంద్ర—"రాపిడ్ ఇంప్రూవ్‌మెంట్ ఇన్ శేఖర్—సరోజా—నీ మాంగల్యం గట్టిది".

ఆ ప్రక్కనే ఉన్న మాలతిని ఆరాధనా భావంతో చూసి కళ్ళు ఒత్తుకుంది సరోజ.

—దంతుర్తి చినరామచంద్రరావు